''వీధి గడపకి పసుపు రాసి, కుంకం బొట్లు పెట్టేవా?'' అని అడిగేడు సోమేశ్వర్రావు భార్యని.



''మీరు మీ గది గడప దాటితే, అన్నీ కనిపిస్తాయి'' చెప్పింది లక్ష్మి.

''అంతేగాని, 'నేను చేసేను' అని చెప్పవు గదా? చెప్తే నీ సొమ్మేం పోతుందే?'' అన్నాడాయన.

''లేకపోతే, ఏవిటండీ ఆ అడగడం? రేపు తెల్లవారితే పండగ కదా? నా డ్యూటీ నేను చెయ్యనా?''

''సర్లే! ఏనాడు మనకి మాటామాటా కలిసింది కనుక? ఇద్దరం ఇరుగుపొరుగు దేశాల్లాగే వుంటున్నాం!''

వాకిట్లో రిక్షా వచ్చి ఆగింది. రిక్షాలోంచి శారద, శ్రీనివాసు దిగి, సంచీలు, ఒక సూట్ కేసూ పట్టుకుని ఇంట్లోకి వచ్చారు.

''ఇదిగో! మీ కూతురూ, అల్లుడూ ఒచ్చేరండీ!'' అని కేకేసింది లక్ష్మి.

''ఏవిటా మాట? నీ కూతు రూ, అల్లుడూ కారా వాళ్ళు?'' అంటూ వచ్చేడు సోమేశ్వర్రావు.

''అలా అనకపోతే, మన కూతురు, అల్లుడు అనరాదూ మీరూ?''

''ఆ మాట నువ్వెందుకనకూడదూ?''

''అబ్బబ్బ! మీ యుద్ధాలు ఇంకా వర్ధిల్లుతూనే వున్నాయా?'' అంది శారద విసుగ్గా నవ్వి. శ్రీనివాసు గట్టిగా నవ్వేడు.

''అన్నయ్య ఏడే?'' అడిగింది శారద.

''వాడు పెళ్ళయ్యేదాకా ఆదివారాలు ఇంటి

# మాయలో మనిషి

—శివల జగన్నాథరావు

1992 న్యూజెర్సీ తెలుగు కళాసమితివారి కథల పోటీలో రు. 200/-లు బహుమతి పొందిన కథ

పట్టున వుండడు!'' అంది లక్ష్మి.

''మొన్న చూపిన సంబంధం కుదర్లేదా?''

''మాకు అన్నీ నచ్చేయిగాని, వాడికి ఏవీ నచ్చలేదన్నాడు!''

7-2-92 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక

అంటుంటే చలం వచ్చేశాడు. ''హలో బావగారూ, ఎప్పుడు వచ్చేరు? బావున్నారా?'' అడిగేడు.

''నీ కంటే ఒక పది నిముషాలు ముందు వచ్చేం! ఏవిటి? పెళ్ళిసంబంధం నీకు నచ్చలేదుటా?'' అన్నాడు శ్రీనివాసు.

''అవును'' అని చెప్పి, ''స్నానాలు చేశారా? కాఫీలు?'' అడిగేడు చలం.

''అన్నీ అవుతాయిగాని, మాట దాటేయకు! ఎందుకు నచ్చలేదు ఆ సంబంధం?'' అడిగింది శారద.

చలం నవ్వేసి, ''చెప్పానుగదే! అమ్మాయిని చూస్తే నా కెంచేతో పలకరించాలనీ, మాట్లాడాలనీ అన్పించలేదు! ఇంక పెళ్ళేలా చేసుకునేది? చేస్కుంటే మన అమ్మ, నాన్నలాగే యుద్ధాల్తో ఇల్లు మార్మోగుతుంది!'' అన్నాడు.

''ఛా వుర్కో గాడిదా'' తిట్టింది లక్ష్మి.

''నీ కిష్టం లేదనీ చెప్పగానీ, మమ్మల్ని కలపకొరేయ్'' అన్నాడు సోమేశ్వరరావు.

''అదిగో చూసేవా? వాళ్ళ సంగతి అలా వుంటుంది! వాళ్ళు వాళ్ళకే గాని, కన్నవాళ్ళ క్కూడా బోధపడరు!!'' అంది శారద నవ్వి.

పండగబట్టలు తను కొన్నవి కూతురికి, అల్లుడికి చూపించేడు సోమేశ్వరరావు. ''అంత ఖరీదు ఎందుకండీ?'' అన్నాడు శ్రీనివాసు.

''నువ్వు అల్లుడి పోర్షను సరిగ్గా నిర్వహించడం లేదోయ్! నీ పాత్రకి నువ్వు పనికిరావు!'' అని సోమేశ్వరరావనగానే అందరూ నవ్వేరు.

''అతనే అల్లుళ్ళా గట్టిగా వుంటే, మీరే తిడతారు మళ్ళాను!'' అంది లక్ష్మి.

చలం భోంచేసి వీధిలోకి వెళ్ళిపోయాడు.

''వీడికింత తీరుబడి లేదేవిటి? ఇంట్లో ఒక్క గంట వుండకుండా వెళ్ళిపోయేడు?'' అంది శారద.

''తీరుబడేవిటి? కాలేజీ వుంటే చదువు, ఫ్రెండ్సూ, గేమ్సు, పిక్చర్సూ, ఏదో ప్రోగ్రాం! ఉద్యోగం అయితే అదీ! పెళ్ళయితే పెళ్ళాం, సంసారం! ఈ పగలుతోనే పగలు సరిపోతుంది! రాత్రేమో నిద్ర!'' అన్నాడు సోమేశ్వరరావు.

ఆ రాత్రి ఆయన కూతురు చేసి తీసుకు వచ్చిందని లడ్డూ సగం తినేసేడు. మిగతా సగం తినబోతూంటే లక్ష్మి ''ఏవిటా కక్కుర్తి?'' అని గట్టిగా కసిరి లాక్కుంది.

సోమేశ్వరరావు కోపంతో ఏదో అనబోయి, కోపాన్ని మింగేసేడు. లక్ష్మి తనని కసిరిందంటే ఆ కసురులో ఎంత ప్రేమ వుందో తనకి తెలుసు! ఆ మందలింపు! కొన్ని సంవత్సరాల అనుబంధం తాలూకు చనువు!!

''పంచదార జబ్బు పాము విషం కంటే ప్రమాదకరమైందని మీకు తెలుసు గదా? తెల్సీ ఎందుకలా తింటారు?'' అంది లక్ష్మి.

''ఏవిటోనే! తీపి అంటే ఇష్టం!'' అని గొణిగేడాయన.

''తీపి కావాలంటే తినే పదార్థాల్లోనే చూడాలా? పెళ్ళాం ప్రేమలో తీపి లేదా? పిల్లల ప్రేమలో తీపి లేదాండీ!'' అంది లక్ష్మి.

''ఏవిటోనే! అన్నీ తెల్సీ నేను మాయలోపడిపోతూంటానే! అసలు తల్లి కడుపులో బిడ్డతోనే ఈ మాయ కలిసే వుంటుంది సుమా! ఇంక మనిషి మాయలో పడక మరెందులో పడతాడు?'' అన్నాడు సోమేశ్వరరావు.

వీధిలో బిచ్చగాడు ''అమ్మా ఆకలేస్తా వుందమ్మా'' అని అరిచేడు.

''దాహం, ఆకలీ ఎవరికి ఎక్కువగా వుంటాయో తెలుసా, లక్ష్మీ? షుగరు పేషెంటుకీ, బిచ్చగాడికీ, లంచగొండికీ'' అని చెప్పేడు సోమేశ్వరరావు నవ్వుతూ.

*   *   *

''ఇక్కడే ఇక్కడే!'' అని, రిక్షా అతడికి చెప్పి, దిగేడు చలం.

రిక్షాల్లోంచి ఇంకా శారదా, శ్రీనివాసు దిగేరు.

సోమేశ్వరరావు తమ్ముడూ, చెల్లెలూ దిగేరు. ఇంకా కొందరు!

ఒక సందులో వుంది ఆ బిల్డింగు.

మట్టూ గోడ. పెద్ద గుమ్మం. లోపల ఆవరణ చాలా వుంది. పెద్ద పెద్ద చెట్లున్నాయి. ఆ చెట్ల కింద రాతి చప్టాలున్నాయి. ఆ చప్టాల మీద పెడుతూన్న వేడి వేడి అన్నం, చెట్ల మీంచీ కాకులు మందలుగా వచ్చి, అన్నం కాస్త చల్లారగానే తింటున్నాయ్. కొంత పట్టుకుపోతున్నయ్.

ఒక వయిపు, మధ్య మధ్య గోడలు పెట్టి, నాలుగు గదులుగా కట్టి వుంది. ఒక్కో గదిలో ఒక్కో పంతులుగారు, శ్రాద్ధ కర్మలు చేయిస్తున్నారు, ఎవరెవరిచేతో.

చలం చేత పంతులుగారు, పదవ రోజు కర్మకాండని యథావిధిగా చేయించేడు. పొయ్యి మీద ఆయన వండిన కుండ పిడతలోని అన్నం, అరటాకులోకి తీసేడు.

ఆ స్థలం అంతా అదో విధమైన సందడి నెలకొని వుంది!

పెద్ద గొంతుతో మంత్రాలు, పిడకలు పొయ్యి పొగ వాసన, గాల్లోకి లేచి కళ్ళు మండించే ఆ పొగ, కాకుల అరుపులు, అక్కడికి రావాలని ఎవరూ కోరుకోరు! కాని- రాక తప్పదు! కర్మకాండ కావాలనుకున్నవారు!

మనిషి మంచీ చెడ్డలకీ, ఐశ్వర్యానికీ, దరిద్రానికీ, పేరుప్రతిష్ఠలకీ, దేనికీ చావుతో సంబంధం లేదు. చావు ఏ జీవినయినా వరిస్తుంది!

సోమేశ్వరరావు బంధువులు అయినవాళ్ళు అంతా, అక్కడ స్నానాలు చేసేరు. తలల మీంచి నీళ్ళోడుతూ పంతులుగారి దగ్గరికి వచ్చేరు.

సోమేశ్వరరావు చనిపోయి అవాళ పదవ రోజు!

ఏదో బరువయిన స్తబ్ధత — ఆయన తాలూకు జ్ఞాపకాల నిర్వేదం — ఈ జీవితాలింతేనా? అనే వైరాగ్యపు భావన — వారందర్నీ ఆవరించింది.

''ధర్మోదకాలు ఒదలండి'' అని చెప్పేడు పంతులుగారు.

ఒక్కొక్కరూ చేతుల్లోకి నీళ్ళు తీసుకుని, పంతులుగారు చెప్పే మంత్రాలతో, ధర్మోదకం వదులుతున్నారు.

ఇందాక శారద అడిగితే పంతులుగారు చెప్పేడు— ''మనిషి ఆత్మని ఆవరించుకుని తాపం వుంటుంది! జీవితంలో సమస్యలతో, సాధకబాధకాలలో తాపంఅంటే వుంటుంది! మరణించినా ఆ తాపం త్వరగా ఆత్మని వదిలి పెట్టదు! ధర్మోదకాలు వదిలితే, తాపం వదిలి, ఆత్మ తేలికపడి, పరలోకాలికి పయనమౌతుంది...!!

*   *   *

గదిలో కూర్చుని వుంది లక్ష్మి.

మనసు దుఃఖంతో కొండంత బరువుగా వుంది.

ఈ పరిస్థితిని ఎలా తట్టుకోవాలో తెలీనట్టు ఆవిడ బేలగా, చూస్తోంది గది గోడల్నీ, గోడ మీద వున్న ఆయన ఫోటోనీ.

ఆ ఫోటోలో ఆయన, తనూ నవ్వుతున్నారు! బాధ్యతలు, బరువులేగాని, ఎడబాటు లేదు కదా తమకి అప్పుడు?!

*   *   *

చలం కొడుకుని ఎత్తుకుని, వీధి గడపలో కూచుంది లక్ష్మి. వాడు తెగ అల్లరి చేస్తుంటే, కోడలు కొట్టింది. కొట్టిందని లక్ష్మికి కోపం వచ్చి, కోడల్ని తిట్టేసింది. ఆ పిల్ల ఏడుస్తూ వెళ్ళి పడుకుంది. లక్ష్మి మనసు చికాకుగా వుంది. చంటి వెధవ అల్లరి పెట్టకుండా వుండడు. కోడలు వాణ్ణి కొట్టకుండా వుండదు! కొడ్తే తనకి గుండె విలవిల్లాడిపోతుంది! తిట్టేస్తుంది కోడల్ని. చలం ఏదీ పట్టించుకోడు!

ఏవిటీ బాధని కొన్నాళ్ళు కూతురింటికి వెళ్ళింది. చలం కొడుకుని వదిలి వుండలేక మళ్ళా మూడు వారాల్లోనే వచ్చేసింది!! భర్త తనతో చెప్పే మాట గుర్తొచ్చిందావిడకి! ''అన్నీ తెల్సీ కూడా నేనుమాయలో పడిపోతూంటానే లక్ష్మీ!''

''మీరే కాదండీ! నేనూ అంతే!'' అనుకుంది మనవడి వేపు చూస్తూ.